క్లుప్తంగా

మోతిమాతను దర్శించుకున్న ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌శెట్కార్

జహీరాబాద్‌: మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో నిర్వహించిన మోతి మాత జాతర ఉత్సవాల్లో ఎంపీ సురేష్‌శెట్కార్, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించి మోతిమాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి తమ వంతు సాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిచరణ్, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప స్వర్ణాభరణాల ఊరేగింపు

సదాశివపేట(సంగారెడ్డి): మకరసంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం పట్టణంలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వర్ణాభరణాల ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ మేరకు అయ్యప్ప సేవాసమితి నిర్వాహకులు సోమవారం వెల్లడించారు. సంగమేశ్వర మందిరం నుంచి మొదలయ్యే ఊరేగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరై ప్రారంభించనున్నారు. శాస్త్రీరోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ విగ్రహం కూడలి, గొల్లకేరీ, కుమ్మరికేరి, దుర్గాభవానీ మందిరం నుంచి కటికేరి, బుక్కకేరి, గండిమైసమ్మ మందిరం, చెన్న బసవేశ్వర మందిరం, గాంధీచౌక్, కోహిర్ బేస్, గురునగర్ కాలనీల మీదుగా అయ్యప్ప మందిరం వరకు కొనసాగుతుంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

గ్రామాల్లో ఘనంగా భోగి సంబరాలు



దౌల్తాబాద్ లో భోగిమంటలు

హత్నూర(సంగారెడ్డి): సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం భోగి పండుగను హత్నూర మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. ఉదయమే భోగి మంటలు వేసి చలికాచుకున్నారు. చిన్నారులకు భోగిపళ్లు పోశారు. ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేశారు.

ప్రారంభమైన శివదీక్షలు



హత్నూర శివాలయంలో శివదీక్ష స్వీకరించిన మాలధారులు

హత్నూర (సంగారెడ్డి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి శివ దీక్షలు మండల కేంద్రమైన హత్నూర శివాలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ప్రారంభమయ్యాయి. గురుస్వామి ఆంజనేయులు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన శివ భక్తులు హత్నూర శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన అనంతరం శివదీక్షను స్వీకరించారు. మండలంలోని దౌల్తాబాద్, వడ్డేపల్లి, నవాబుపేట, ఫైజాబాద్,ఆవంచ, రామచంద్రాపూర్, దేవులపల్లి, దౌలాపూర్, మధుర తదితర గ్రామాల శివ భక్తులు శివ దీక్షను స్వీకరించారు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి వరకు శివదీక్ష మండల కాలం ఉదయం సాయంత్రం శివాలయంలో పూజలు నిర్వహించనున్నట్లు గురుస్వామి తెలిపారు.

భవానీ మాత ఆలయంలో యజ్ఞం



భవానీ మాత ఆలయంలో నిర్వహిస్తున్న యజ్ఞం

జహీరాబాద్ టౌన్‌: పట్టణ సమీపంలో హోతి(కె) గ్రామ పరిధిలో గల ప్రసిద్ధి చెందిన భవానీ మాత ఆలయంలో సోమవారం మహా యజ్ఞం నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో పూజారి వేణు భట్ యజ్ఞాన్ని ఘనంగా జరిపారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పద్మశాలి సంఘం అధ్యక్షులు గడ్డం జర్దాన్ తదితరులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

వైభవంగా భోగి వేడుకలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి.. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో భోగి మంటలు



సంగారెడ్డి జోన్‌: సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డి పల్లి చౌరస్తాలో భోగిమంటలు



జిన్నారం(పటాన్‌చెరు): పతంగులతో చిన్నారుల సందడి



న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లో ఇంటి ముంగిట ముగ్గు వేస్తున్న బాలిక



పొంగిలి పొంగిస్తున్న చిన్నారులు

జిల్లాలో సంక్రాంతి పండుగ సంబురాలు వేడుకగా సాగాయి. మొదటి రోజు భోగి పండుగను వైభవంగా నిర్వహించారు. కాలనీలు, వీధుల్లో భోగి మంటలు వేశారు. ముంగిళ్లను శుభ్రపరిచి, అందమైన ముగ్గులు వేశారు. గొబ్బెమ్మలు, పూలు, నవధాన్యాలు పెట్టి అలంకరించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా గాలి పటాలను ఎగురవేశారు.

– సంగారెడ్డి జోన్‌

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



నీలం మధుతో మాట్లాడుతున్న మత్స్యకారుల సంఘం సభ్యులు

పటాన్‌చెరు టౌన్‌: మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండలంలోని ఇస్నాపూర్‌లో మత్స్యకారులతో కలిసి ఆయన మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా మత్స్యశాఖలో సభ్యత్వం, కాలుష్యం వలన జీవనోపాధిపై వారితో చర్చించామన్నారు. గతంలో ఈ సమస్యపై తాను డీఎఫ్‌ఓ, పీసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. అధికారులు పరిష్కార చర్యల దిశగా అడుగులేస్తున్నారని, ఇస్నాపూర్‌లో నూతన సంఘం ఏర్పాటుకు సహకరించినట్లు గుర్తు చేశారు. పాశమైలారం పారిశ్రామిక వాడలో వెలువడుతున్న కాలుష్యం కారణంగా ఇస్నాపూర్, చిట్కుల్ ప్రాంతంలో చెరువులు విషపూరితంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందరి సహకారంతో నియోజకవర్గంలో మత్స్యకారుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు రాఘవేందర్, పెంటయ్య, నర్సింహులు, వెంకటేశ్, గోపాల్, రవి, మల్లేష్, మనోహర్, శ్రీనివాస్, మల్లేశం, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి గోదావరి జిల్లాలకు..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంక్రాంతికి నేతలు, యువకులు పెద్దఎత్తున గోదావరి జిల్లాలకు తరలివెళ్లారు. అక్కడ జరిగే కోడి పందేలు, కోనసీమ అందాలను తిలకించనున్నారు. ప్రధానంగా రామచంద్రాపురం, తెల్లాపూర్, పటాన్‌చెరు, అమీన్‌పూర్ ప్రాంతాలలో ఏపీకి చెందిన అనేక మంది కార్మికులు, ఉద్యోగస్తులు, వ్యాపారవేత్తలు నివాసం ఉంటున్నారు. యేటా అక్కడ జరిగే సంక్రాంతి సంబరాలకు ఇక్కడి మిత్రులను, నేతలు ఆహ్వానించడంతో సరదాగా 4 రోజులు ఏపీకి తరలివెళ్తున్నారు. అక్కడి వంటకాల రుచులు చూసి, కోనసీమ అందాలను వీక్షించి, కోడి పందేలలో పాల్గొని సంబరపడుతున్నారు. భీమవరం, రాజోలు, పాలకొల్లు, అమలాపురం, కృష్ణ, గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు స్నేహితులతో కలిసి సరదాగా వెళ్లారు. అలాగే చుట్టుపక్కల ఉన్న ఆలయాలను సందర్శించుకుంటున్నారు. కొంతమంది వారి కుటుంబ సభ్యులతో కలిసి కోడిపందేలను చూసేందుకు ఎక్కువగా భీమవరం వెళ్తున్నారు. ఆదివారం, సోమవారం ఈప్రాంతం నుంచి వందలాది వాహనాల్లో ఆంధ్రకు తరలివెళ్లారు.

క్రికెట్ టోర్నీ విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్‌: ఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే దివంగత శివురావు షెట్కార్ స్మారకార్థం ఈనెల 16 నుంచి నిర్వహించనున్న క్రికెట్ టోర్నీకి సంబంధించిన కరపత్రాలను సోమవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ ఆవిష్కరించారు. టోర్నీలో అధికజట్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరుతూ టోర్నీతో యువతను ప్రోత్సహిస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. పీసీసీ సభ్యులు శ్రీనివాస్, ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళికా సంఘ మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, మాజీకోఆప్షన్ సభ్యులు రశీద్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్‌షెట్కార్, సాగర్ షెట్కార్, నిర్వాహకులు భూపాల్, పవన్, వాజీద్, శ్రీకాంత్, సుమన్ పాల్గొన్నారు.

నూతన నియామకం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడిగా ఈదులనాగులపల్లికి చెందిన రాంబాబుగౌడ్ ఎన్నికయ్యారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పార్టీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

ఆలయాల్లో పూజలు

మునిపల్లి(అందోల్): సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ ఆలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులకు జీవన్ముక్త మహరాజ్ సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు. అలాగే మక్తక్యాసారం ఆత్మానందాశ్రమంలో పరమహంస పరివ్రాజకాచార్య మదనానంద సరస్వతి స్వామి, పూజ్య పాదగురు రాజయోగి వెంకటస్వామి గురుమూర్తులకు ఆశ్రమభక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని సింగూరు గ్రామంలో నందికంటి శేఖర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీలలో గ్రామంలోని వివిధ యువజన సంఘాల జట్లు పాల్గొన్నాయి. ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గొంగులూర్ గ్రామంలో ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అశోక్ తెలిపారు. ఆసక్తి కలిగిన జట్లు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు నందికంటి శ్రీనివాస్,వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

జహీరాబాద్ టౌన్‌: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా జ్యోతి పండాల్, మంజుల, మహిళా జాగృతి అధ్యక్షురాలు అనుషమ్మలు వ్యవహరించారు. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సయ్యద్ మహబూబ్,శేఖాపూర్ అబ్దుల్లా, సంతోష్, రాములునేత, వినోద్‌లు పాల్గొన్నారు.

అటవీ అధికారులకు నెమలి అప్పగింత



ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారికి నెమలిని అప్పగిస్తున్న దత్తాత్రేయ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన దత్తాత్రేయ అనే యువకుడు అపస్మారక స్థితిలో పడి ఉన్న నెమలికి చికిత్స చేయించి సోమవారం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూర్ శివారులో అదే గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు దర్జీ సుధాకర్‌కు చెందిన పంట పొలంలో నెమలి అపస్మారక స్థితిలో పడి ఉంది. ఉదయం అటుగా పొలానికి వెళ్లిన వారి కుమారుడు దర్జీ దత్తాత్రేయ గమనించి సదాశివపేటలోని పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. అనంతరం నెమలిని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి వేణుగోపాల్‌కు గ్రామస్తులతో కలిసి తాను అప్పగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, అధికారులు దత్తాత్రేయను అభినందించారు.

ఊరూవాడ సంక్రాంతి సందడి



సదాశివపేట పట్టణంలోని గాంధీచౌక్ వద్ద పతంగుల కొనుగోలు...

సదాశివపేట(సంగారెడ్డి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం పట్టణంలో సంక్రాంతి సందడి కనిపించింది. పట్టణంలోని గాంధీచౌక్, శాస్త్రీ రోడ్డు, బుక్కకేరీ, సుభాష్‌రోడ్డుల్లోని పిల్లాపాపలు, యువకులు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. అదేవిధంగా వస్త్ర దుకాణాలు, రంగుల దుకాణాలు కొనుగోలుదార్లతో కిటకిటలాడాయి.

ఆలయాల్లో పూజలు

మునిపల్లి(అందోల్): సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ ఆలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులకు జీవన్ముక్త మహరాజ్ సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహరాజ్ ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు. మక్తక్యాసారం ఆత్మానందాశ్రమంలో పరమహంస పరివ్రాజకాచార్య మదనానంద సరస్వతి స్వామి, పూజ్య పాదగురు రాజయోగి వెంకటస్వామి గురుమూర్తులకు ఆశ్రమభక్తులు పూజలు నిర్వహించారు.

ఫిబ్రవరి 15ను సెలవుదినంగా ప్రకటించండి



పోస్టుకార్డులు చూపుతున్న మాధ్వార్ తండావాసులు

నారాయణఖేడ్‌: సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవుదినంగా ప్రకటించాలని కోరుతూ ఖేడ్ మండలం మాధ్వార్ తండావాసులు పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు సోమవారం సెలవుదినంగా ప్రకటించాలని కోరుతూ తండాలోని ఇంటికొకటి చొప్పున పోస్టుకార్డులను రాసి ఈమేరకు తండాలోని భవానీ మాత, సేవాలాల్ ఆలయాల ఎదుట ప్రదర్శించారు. ఈ సందర్భంగా బంజారా సేవాలాల్ సంఘ ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి రాజునాయక్ మాట్లాడుతూ గిరిజన, బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15న ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. సంఘ జిల్లా, డివిజన్ నాయకులు హర్జనాయక్, చందర్ నాయక్, శ్రీనివాస్, లక్ష్మణ్ నాయక్, సర్దార్ నాయక్, రవి, సోమ్లానాయక్, తవడావాసులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవలు

క్లబ్ జోన్ చైర్మన్ తోట్ల రామకృష్ణ ముదిరాజ్



ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న సభ్యులు

జోగిపేట(అందోల్): ఫలితాన్ని ఆశించకుండా సేవచేసేదే లయన్స్ క్లబ్ అని ఆ క్లబ్‌జోన్ చైర్మన్ తోట్ల రామకృష్ణ ముదిరాజ్ అన్నారు. జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జన్మదినం సందర్భంగా దానంపల్లిలోని మదనానంద ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రోగ్రాం చైర్మన్‌గా జిల్లా కార్యదర్శి రాంబాబు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ రాంబాబు, జోగిపేట క్లబ్ సెక్రటరీ జీఆర్ మధుసూదన్ రెడ్డి, కోశాధికారి సంతోష్, సభ్యులు ఎం.మల్లేశ్ పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణోత్సవం



వైకుంఠపురంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సంగారెడ్డి టౌన్‌: పట్టణ శివారులోని వైకుంఠపురంలో ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలను ప్రధాన అర్చకులు వర్గాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

వైకుంఠపురంలో కల్యాణోత్సవం

సంగారెడ్డిటౌన్‌: పట్టణ శివారులోని వైకుంఠపురంలో ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వెంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. అనంతరం లడ్డూ వేలం పాటను ధర్మపురి ప్రవీణ్ 2,77,777కు సొంతం చేసుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



వేలంపాటలో లడ్డూ దక్కించుకున్న ధర్మపురి ప్రవీణ్

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్‌: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములుపై దాడిచేసిన అయ్యప్ప స్వాములతో పాటు వారివెంట ఉన్న వారిని వెంటనే అరెస్టు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షులు కాశీనాథ్ జాదవ్ డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ సోమవారం ఖేడ్ మండల వనరుల కేంద్రం ఎదుట నిరసన నిర్వహించారు. నిందితులను అరెస్టు చేసి, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం డివిజన్ బాధ్యులు ఏశప్ప, నర్సయ్య, హరిసింగ్, శ్రీరామ్ నాయక్, రాములు, శివకుమార్, అప్పారావు, పంచాక్షరి, విష్ణు, దేవదానం, శివనాయక్ పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా ఉర్సు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఆదిత్యరెడ్డి

పటాన్‌చెరు టౌన్‌: కులమతాలకు అతీతంగా ఉర్సు ఉత్సవాలు జరుగుతాయని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రొటోకాల్ చైర్మన్ డాక్టర్ ఆదిత్యరెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఉర్సు ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు వీరిని సన్మానించారు.